జగన్‌ను మళ్లీ సీఎం చేయడానికి జనం సిద్ధం



సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్లను ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందించారు. అందువల్లే తిరిగి ఆయన్ను సీఎంను చేయడానికి ప్రజలు సిద్ధమయ్యారు' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అమ్మవారిపాళెం గ్రామంలో రూ.24.50 లక్షలతో పూర్తయిన సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లను సోమవారం మంత్రి ప్రారంభించారు. గ్రామ గిరిజన కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో తలపెట్టిన కృష్ణ మందిరానికి శంకుస్థాపన చేశారు. 20 మందికి ఉచిత వంట గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కాకాణి మాట్లాడారు. సర్వేపల్లిలో ఇప్పటి వరకు టీటీడీ నిధులతో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 78 ఆలయాలను నిర్మించామన్నారు. 100 దేవాలయాలను నిర్మించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సీఎం జగన్ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన అందించారన్నారు. ఆయన ఒక్క పిలుపుతో లక్షలాది మంది మేదరమెట్ల సిద్ధం సభకు హాజరైనట్లు చెప్పారు. జాతీయ, రాష్ట్ర స్థాయి సర్వేలన్నీ వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని వెల్లడిస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారిపాళెం గ్రామ చెరువుకు దక్షిణ కాలువ ద్వారా సాగునీటిని అందించేందుకు అటవీ అనుమతులు లభించలేదన్నారు. తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే చెరువుకు సాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీరవసంతరావు, ఎంపీడీఓ మహ్మద్ రఫీ, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, మాజీ సీడీసీ చైర్మన్ ఎ.మనోహర్‌నాయుడు, పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, మాజీ ఎంపీపీలు కోనం చినబ్రహ్మయ్య, నోటి మాలకొండారెడ్డి, నాయకులు ఎ.ధనుంజయనాయుడు, ఎ.కోదండయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



ముత్తుకూరు మండలంలో..



బుచ్చిరెడ్డిపాళెం మండలంలో..

ముత్తుకూరు: మండలంలోని మామిడిపూడిలో జగనన్న కాలనీ ఇంటి నివేశన స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సర్పంచ్ కాకి మస్తానమ్మ, వైఎస్సార్‌సీపీ నేత పద్మనాభరెడ్డి కలిసి 71 మందికి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ గౌస్‌బాషా, వీఆర్వో ఉమాదేవి, కార్యదర్శి అహమదున్నీసా, అడ్మిన్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

• **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** నగర పంచాయతీ పరిధిలోని మూడో వార్డు ఇస్కపాళెం–1 సచివాలయంలో సోమవారం రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడూరు మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ ఆదిశేషయ్య, జావిద్, అనిల్, ప్రసాద్, చలపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

శివపార్వతులకు ఏకాంతసేవ



ఏకాంత సేవలో స్వామి, అమ్మవారు

మనుబోలు: మనుబోలు బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి మందిరం ఆవరణలో శివపార్వతులకు సోమవారం రాత్రి ఏకాంతసేవను వైభవంగా నిర్వహించారు. ఈనెల 9వ తేదీన స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. అర్చకులు శ్రీనివాసులు శివపార్వతులకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. మహిళలు విచ్చేసి ఏకాంతసేవను తిలకించారు. గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. గ్రామ పెద్దలు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉదయకళేశ్వరుని హుండీ కానుకల లెక్కింపు

కొడవలూరు: మండలంలోని గండవరం గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవ హుండీ కానులను లెక్కించారు. గతేడాది రూ.15.85 లక్షలు రాగా ఈ ఏడాది రూ.16.07 లక్షలు వచ్చింది. స్వామికి ప్రతి ఏడాది తొమ్మిది రోజులపాటు అత్యంత వేడుకగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. తెప్పోత్సవం ముగిసిన మరుసటి రోజు హుండీ కానుకలను లెక్కించడం ఆనవాయితీ. సోమవారం ఆలయ ప్రాంగణంలో అధికారుల ఆధ్వర్యంలో లెక్కింపు జరిగింది. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ చైతన్య, ఈఓలు బండి శాంతయ్య, శ్రీనివాసులు, ఆలయ అర్చకులు బండారు సుబ్రహ్మణ్యం, ఉత్సవ కమిటీ సభ్యుడు రామిరెడ్డి రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరులోని సీఐఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న ప్రొఫెసర్ టీవీ రమణ మెమోరియల్ టీ–20 క్రికెట్ లీగ్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన తొలి సెమీఫైనల్స్‌లో ఎన్‌యూసీసీ, ఏఎల్‌ఎంసీసీ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఎన్‌యూసీసీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఏఎల్‌ఎంసీసీ జట్టు 4 వికెట్లు కోల్పోయి 149 పరుగులు మాత్రమే చేసింది. దీంతో ఎన్‌యూసీసీజట్టు 30 పరుగుల తేడాతో విజేతగా నిలిచి ఫైనల్‌కు చేరింది. రెండో సెమీఫైనల్స్‌లో ఎల్‌సీసీ, జీఎస్‌ఆర్‌సీసీ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఎల్‌సీసీజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 162 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జీఎస్‌ఆర్‌సీసీ జట్టు 139 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 23 పరుగుల తేడాతో ఎల్‌సీసీ జట్టు విజేతగా నిలిచి ఫైనల్‌కు చేరింది. ఈ నెల 17న ఉదయం 10గంటలకు రెండు జట్లు ఫైనల్స్‌లో తలపడనున్నాయని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి నిఖిలేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీలను జిల్లా అధ్యక్షుడు సీవీఎస్ మూర్తి, మాజీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.



అభినవ ఘంటసాల పాటూరికి ఉగాది పురస్కారం

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో సంకీర్తన కళాసమితి అధ్యక్షుడు చింతా ప్రసాద్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. సీనియర్ గాయకుడు, అభినవ ఘంటసాల బిరుదాంకితుడు పాటూరి శ్రీనివాసులుకు ఉగాది పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. నెల్లూరు ఆర్డీఓ మలోల ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దశాబ్దాలుగా తన గాన మాధుర్యంతో ఎందరి నుంచే ప్రశంసలు అందుకున్న గాయకుడు పాటూరి శ్రీనివాసులుకు ఉగాది పురస్కారాన్ని అందజేసి సత్కరించడం హర్షణీయమన్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు నిర్మల నరసింహారెడ్డి, సంకీర్తన కళాసమితి గౌరవాధ్యక్షుడు ఏవీఎస్ కృష్ణమోహన్, కనకరాజు, రియాజ్‌బాషా, హైటెక్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన నేడు

కోవూరు: మండలంలోని చెర్లోపాళెం గ్రామంలో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాల భవనాలను మంగళవారం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రారంభిస్తారని డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నాయకులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జగన్ననకు చెబుదాంలో అర్జీల స్వీకరణ

పొదలకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కె.వీరవసంతరావు సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలను స్వీకరించారు. భూ సమస్యలు, అసైన్‌మెంట్, హద్దులు, పాసుపుస్తకాల పంపిణీ తదితర వాటిపై వినతిపత్రాలను అందజేశారు. అర్జీలను స్వీకరించిన తహసీల్దార్ వెంటనే పరిష్కరించడం జరుగుతుందని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. బుజబుజనెల్లూరుకు చెందిన కరిముల్లా పని నిమిత్తం మోటార్‌బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి బుజబుజనెల్లూరుకు బయలుదేరాడు. ఎదురుగా ఆటో అడ్డురావడంతో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో అతడికి గాయాలవగా స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

డీటీకి ఫిర్యాదు

ఇందుకూరుపేట: మండలంలోని నరసాపురంలో ఉన్న దొరువును ఆక్రమించారని నరసాపురం, మైపాడుకు చెందిన వారు సోమవారం స్పందనలో డిప్యూటీ తహసీల్దార్ జగదీష్‌కు ఫిర్యాదు చేశారు. దొరువుకు సంబంధించి దొంగ పత్రాలను సృష్టించి రెవెన్యూ అధికారుల సాయంతో ఆక్రమణలకు పాల్పడుతున్నారన్నారు. నిర్మాణాలు సైతం చేపడుతున్నారన్నారు. వెంటనే చర్యలు చేపట్టాలని డీటీని కోరారు.

పరీక్ష సామగ్రి అందజేత

కోవూరు: మండల కేంద్రమైన కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు ఎంపీపీ టి.పార్వతి పరీక్ష సామగ్రి అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు నరసింహామూర్తి మాట్లాడుతూ ఎంపీపీ రెండు సంవత్సరాలుగా సొంత నిధులతో సామగ్రిని అందజేస్తున్నారని తెలిపారు.

డాక్టర్ మురళీకృష్ణకు పురస్కారం



ముత్తుకూరు: మండల కేంద్రమైన ముత్తుకూరుకు చెందిన జోతిష్యమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణకు 'జ్యోతిధర్ సమృతి–2024' పురస్కారం లభించింది. తమిళనాడుకు చెందిన ఇంటర్నేషనల్ వేదిక్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం చెన్నైలో జరిగిన 'తమిళనాడు ఆస్ట్రాలజికల్ కాన్వొకేషన్'లో ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

వావిళ్లలో నేత్రదానం



లక్ష్మమ్మ (ఫైల్)

విడవలూరు: మండలంలోని వావిళ్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ తుళ్లూరు గోపాలయ్య మాతృమూర్తి లక్ష్మమ్మ (87) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. కుటుంబసభ్యుల కోరిక మేరకు మనసేవా సంస్థ చైర్మన్ దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో ఆమె నేత్రాలను నెల్లూరు మోడ్రన్ ఐ ఆస్పత్రి డాక్టర్లు సేకరించారు.

నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి సేవలు మరువలేనివి



శ్రీనివాసులురెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన నాయకులు

కోవూరు: జిల్లాకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి కొనియాడారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం గ్రామంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ నలుబోలు శ్రీవాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంచాయతీ ముఖద్వారం, శ్రీనివాసులురెడ్డి, నలుబోలు వీరరాఘవరెడ్డి కాంస్య విగ్రహాలను ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తనయుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీనివాసులురెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో అనేక వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. వీరరాఘవరెడ్డి గ్రామాభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసిన పార్టీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, సర్పంచ్ శ్రీవాణిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ టి.పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ఆర్.మల్లికార్జునరెడ్డి, నేతలు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, విజయసేనారెడ్డి, సర్పంచ్ లక్ష్మీకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి సాయియశ్వంత్‌రెడ్డి, జగదీష్, చిన్నా, శ్రీధర్, జాషువా, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్లు, నేతలు అల్లం రాజా, జానాగౌడ్, మల్లికార్జున్‌రావు, దామర్ల మధుసూదన్‌రావు, మాజీ సర్పంచ్ పుల్లయ్య, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు



ఇందుకూరుపేట: మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ చిరుధాన్యాలతో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంజుల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

• **విడవలూరు:** తక్కువ ఖర్చుతో కూడిన ఆకుకూరలు తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన అన్ని రకాల పోషకాలు అందుతాయని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ బి.రమణి అన్నారు. మండలంలోని ఊటుకూరు సెక్టార్ ముదివర్తి పంచాయితీలోని చెలికల గ్రామంలో సోమవారం మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు భాస్కర్, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.తిరపతమ్మ, రాజ సులోచనమ్మ, లావణ్య, హేమలత, శీనమ్మ, శారద, మహిళా పోలీస్ పి.లక్ష్మీరాజ్యం తదితరులు పాల్గొన్నారు.



విడవలూరు మండలంలో..

పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహావిష్కరణ

కోవూరు: మండల కేంద్రమైన కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో సోమవారం పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన సరస్వతీదేవి విగ్రహాన్ని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తనయుడు రజత్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు డి.నిరంజన్ బాబురెడ్డి ప్రారంభించారు. అమ్మవారికి అర్చకులు శ్రీకాంతాచార్యులు, శేఖర్ స్వామి, జగదీష్ ప్రత్యేక పూజలు చేశారు. వక్తలు మాట్లాడుతూ రాధాకృష్ణారెడ్డి, డాక్టర్ మల్లికార్జున ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలను కోవూరులో చేపట్టారన్నారు. ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ మల్లికార్జునరెడ్డి,ఎంపీపీ టి.పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ద్వారా కంప్యూటర్లు

పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ నెల్లూరు సహకారంతో కంప్యూటర్లను త్వరలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అసిస్టెంట్ గవర్నర్ కె.రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. క్లబ్‌కు సంబంధించిన విద్యార్థినులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన వారికి ప్రోత్సాహకాలు అందిస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు. నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డిల ద్వారా సర్టిఫికెట్‌ను ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తికి అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ సమీవుల్లా, ఇనమడుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అమ్మవారి విగ్రహం వద్ద నేతలు

పదో తరగతి విద్యార్థులకు అవగాహన

మనుబోలు: స్థానిక జెడ్పీ బాలకల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సోమవారం పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నెల్లూరులోని సహస్ర హార్ట్ అండ్ మైండ్ కేర్ హాస్పిటల్‌కు చెందిన సైకాలజిస్ట్ డాక్టర్ గుర్రం సుజిత మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని జయిస్తే విజయం ఖాయమని చెప్పారు. చాలామంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలంటే భయపడుతుంటారని తెలిపారు. ఒత్తిడికి గురైతే తెలిసిన విషయాన్ని కూడా మరిచిపోయే ప్రమాదం ఉందన్నారు. శారీరక, మానసిక అలసటకు గురికాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వివరించారు. విద్యార్థులకు పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసంతకుమారి, ఉపాధ్యాయులు ఉషాకుమారి, ఉషారాణి, హసీన, శోభ, ప్రియంక, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సుజిత

జీజీహెచ్‌కు గాజు క్లాత్ కటింగ్ మెషీన్ వితరణ

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్)కు ప్రభుత్వ మెడికల్ కళాశాల, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ కో–ఆర్డినేటర్ కాకుటూరి లక్ష్మీసునంద గాజు క్లాత్ కటింగ్ మెషీన్‌ను వితరణ చేశారు. తమ సొంత నిధులు రూ.25 వేలు వెచ్చించి ముంబై నుంచి మెషీన్‌ను తీసుకొచ్చి జీజీహెచ్‌కు సూపరింటెండెంట్ సిద్ధా నాయక్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ జీజీహెచ్‌లో ప్రతి నెలా వేలాది మంది రోగులకు ఆపరేషన్లు, ఇతర గాయాలకు కట్లు కట్టేందుకు గాజు క్లాత్‌ను వాడాల్సి ఉందన్నారు. పెద్ద తాన్లుగా వచ్చే గాజు క్లాత్‌ను కట్ చేసేందుకు మెషీన్ లేకపోవడంతో సాధారణ కత్తెరతో కత్తిరించే చేసే క్రమంలో చేతులు బొబ్బలు లేసి సిబ్బంది తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను గుర్తించి తమ సొంత నిధులతో కటింగ్ మెషీన్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీ డాక్టర్ కళారాణి, ప్రొఫెసర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.



మెషీన్‌ను ప్రారంభిస్తున్న లక్ష్మీసునంద, సూపరింటెండెంట్ సిద్ధానాయక్

క్లుప్తంగా

కార్మికుడికి రూ.10 వేల సాయం



కోవూరు: అనంతసాగరం మండలం లింగంగుంట గ్రామానికి చెందిన దాసరి వెంకటయ్య అనే కల్లుగీత కార్మికుడు తాటి చెట్టుపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స చేయించుకుని కోవూరు గ్రామంలో తన కుమారుడు ఇంటి దగ్గర ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో వెంకటయ్యను జిల్లా గౌడ సంఘం నాయకులు కె.రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో టి.ప్రభాకర్‌గౌడ్ సోమవారం పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ గౌడ్, రాజు గౌడ్, గోవింద్ గౌడ్, వంశీ కృష్ణ గౌడ్, సుబ్బరాయుడు, కోనేటి మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో సోమవారం ఎన్‌బీడీసీపీ కార్యక్రమం నిర్వహించారు. జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానప్రసూన, ఉపాధ్యాయులు సుభాష్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, సూపర్‌వైజర్ సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈఐఎల్ ఎనర్జీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రతినిధులు

తోటపల్లిగూడూరు: దేశంలోనే అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థల్లో ఒకటైన సెంబ్‌కార్ప్‌కు ప్రతిష్టాత్మకమైన సీఐఐ గోల్డ్ అవార్డు లభించించినట్లు కంపెనీ సీఈఓ శ్రీరాఘవ్ త్రివేది సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం విజయవాడలో జరిగిన సీఐఐ వార్షిక సమావేశం, ఇండస్ట్రియల్ సేఫ్టీ ఎక్స్‌లెన్స్ – 2023 వేడుకల్లో కంపెనీ తరపున ఓఅండ్ఎం హెడ్ సునీల్‌కుమార్ గుప్తా, హెచ్ఎస్ఈ హెడ్ పవన్‌కుమార్‌రావు అవార్డును స్వీకరించారన్నారు.

నూతన విద్యుత్ సెక్షన్ కార్యాలయం ప్రారంభం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలో నూతన విద్యుత్ సెక్షన్ కార్యాలయాన్ని ఎస్ఈ విజయన్ సోమవారం ప్రారంభించారు. నూతన సెక్షన్ కార్యాలయ ఏఈగా బి.కృష్ణవేణి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు నూతన సెక్షన్ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. వెంకటేశ్వరపురం, భగత్‌సింగ్ కాలనీ, జగనన్న హౌసింగ్ కాలనీ, వెంకటేశ్వరపురం వైఎస్సార్ టిడ్కో గృహాలు, అల్లీపురం గాంధీ గిరిజన కాలనీ, అల్లీపురం టిడ్కో గృహ సముదాయాలు నూతన సెక్షన్ పరిధిలోకి వస్తాయన్నారు. ఈ సెక్షన్ కార్యాలయంలో లైన్ ఇన్‌స్పెక్టర్లు 2, లైన్‌మెన్లు 2, అసిస్టెంట్ లైన్‌మెన్లు 5, జూనియర్ లైన్‌మెన్లు 4, జూనియర్ లైన్‌మెన్లు (గ్రేడ్–2) 4 విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి, కన్‌స్ట్రక్షన్ ఈఈ తనమల శ్రీధర్, డీఈఈ మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పులి వాహనోత్సవం



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు సోమవారం రాత్రి పులి వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సంప్రదాయంలో భాగంగా ఉదయం ఆదిదంపతులకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం చప్పరోత్సవం విశేషంగా నిర్వహించారు. రాత్రి ఆదిదంపతులను విశేషంగా అలంకరించి పులి వాహనంపై కొలువుదీర్చి నగరోత్సవం జరిపారు.